క్లుప్తంగా

రక్తదానం



జనగామ: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం పోలీసు కానిస్టేబుల్ శాద పోచయ్య రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్‌తో 60 రోజుల పాటు జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత వీర సైనికులు ప్రాణాలను త్యాగం చేసి, విజయకేతనం ఎగుర వేశారన్నారు. అమరుల త్యాగాలకు గుర్తుగా దేశ ప్రజలు ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా జరుపుకుంటున్నారన్నారు.

ఆర్థికసాయం

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి, కన్నాయిపల్లిలో మృతి చెందిన వారి కుటుంబాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర కుమారుడు ఇమ్మానియేల్‌రాజు బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఇమ్మానియేల్‌రాజు కాంగ్రెస్ నాయకులతో కలిసి కన్నాయిపల్లిలో మృతి చెందిన ఎల్లయ్యగౌడ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కంచనపల్లిలో మృతిచెందిన కొత్తపల్లి రామమల్లయ్య మృతదేహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఎంపీటీసీలు రచ్చ సోమనాథ్, అల్లిబిల్లి కృష్ణ, కొమురెల్లి ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కొడకండ్ల: మండలంలోని హక్యతండాకు చెందిన గుగులోత్ యాకు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ ఆధ్వర్యంలో సింథసిస్ క్యారెక్టరైజేషన్ బయో అప్లికేషన్స్ ఆఫ్ సిల్వర్, గోల్డ్, కార్బన్ డాట్స్ అనే అంశంపై పరిశోధన చేసి నివేదికను యాకు సమర్పించి డాక్టరేట్ పట్టాను పొందాడు. డాక్టరేట్ పొందడం పట్ల సర్పంచ్ రాగ్యానాయక్‌తో పాటు తండావాసులు యాకుకు అభినందనలు తెలిపారు.

ఇస్కాన్ హరే కృష్ణ పట్టణ ప్రచార కమిటీ


ధనంజయ్ పండిత్ దాస్


గిరిగాని రమేష్ ప్రభు


సనాతన ప్రభుదాస్

జనగామ: ఇస్కాన్ హరే కృష్ణ పట్టణ నూతన ప్రచార కమిటీని జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధనంజయ్ పండిత్ దాస్ ప్రభు, ప్రధాన కార్యదర్శిగా గిరిగాని రమేష్ ప్రభు, ఉపాధ్యక్షుడిగా సనాతన ప్రభుదాస్‌ను ఎన్నుకున్నట్లు ధనుంజయ్ పండిత్‌దాస్‌ప్రభు తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ ప్రచార కమిటీ సంయోజక్ గుజ్జల కుమారస్వామి పాల్గొన్నారు.

వ్యాపారికి బెదిరింపు

జనగామ: కత్తి, గొడ్డలితో ఇద్దరు కార్మికులు ఓ వ్యాపారిని బెదిరించిన ఘటన జనగామ పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. సీఐ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామకు చెందిన లక్ష్మారెడ్డి సిద్దెంకి గ్రామంలో పౌల్ట్రీ ఫాం నడిపిస్తున్నారు. ఆయన వద్ద భూపాలపల్లి జిల్లాకు చెందిన సురేష్ అశోక్ ఇద్దరు పని చేస్తున్నారు. పౌల్ట్రీ ఫాం ఆవరణలో ఉన్న చెట్లను నరికేందుకు ఇద్దరికి పని అప్పగించాడు. చెట్లను నరికి వేసిన తర్వాత యజమాని వద్ద డబ్బులు తీసుకున్న వారు కత్తి, గొడ్డలి తీసుకుని పట్టణంలోని పలు దుకాణాలకు వచ్చారు. ఇదే క్రమంలో సిద్దిపేట రోడ్డులోని సుగుణ వస్త్ర దుకాణంలోకి వచ్చి వ్యాపారి నర్సింహను బెదిరించినట్లు చెప్పారు. డబ్బులు, వేరే డిమాండ్ చేయకున్నా భయపడి ఫిర్యాదు చేయగా వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని 14 మూగజీవాలు మృతి

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారిలో ఓ కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో మూగజీవాలు అక్కడికక్కడే మృత్యువాత పడిన సంఘటన బుధవారం కామారెడ్డిగూడెం పరిధిలో జరిగింది. జనగామ వైపు నుంచి సూర్యాపేట వెళ్తున్న ఎంహెచ్03 డీఇ 5403 నంబరు గల కారు అతివేగంగా వచ్చి కామారెడ్డిగూడెం పరిధి బీరప్ప గుడి ఏరియాలో తాటిపెల్లి సోమయ్య గొర్ల మందను ఢీకొట్టింది. ఈ సంఘటనలో రహదారిపై 14 మూగజీవాలు (గొర్లు) మృతి చెందాయి. దీంతో బాధిత పెంపకందారుడికి సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్టు వాపోయాడు. సంఘటన స్థలానికి ఎస్సై రమేష్‌నాయక్ చేరుకొని కారును స్వాధీనం చేసుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కొనసాగుతున్న సమ్మె

సాక్షి నెట్‌వర్క్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయాల వద్ద జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె 21వ రోజుకు చేరుకుంది. వర్షంలో సైతం సమ్మెను కొనసాగించారు. సమ్మెలో భాగంగా బుధవారం వినూత్న రీతుల్లో నిరసన తెలిపారు. నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన

జఫర్‌గఢ్‌లో ఎరువుల షాపులోకి చేరిన వరద నీరు



కొడకండ్ల: మత్తడి పోస్తున్న ఏడునూతుల పెద్దచెరువు



నర్మెట: వెల్దండ రిజర్వాయర్, కేసిరెడ్డి పల్లి రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జోరు వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. జోరు వానలకు జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతంలోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీటితో పలు గ్రామాల్లో వరి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



దేవరుప్పుల: సింగరాజుపల్లిలో మత్తడి పోస్తున్న సింగరాయచెరువు



స్టేషన్‌ఘన్‌పూర్: మత్తడిపోస్తున్న శివునిపల్లి చెరువు



కొడకండ్ల: నిండుకుండలా రామవరం పాత చెరువు



కొడకండ్ల: వరదనీటితో మునిగిన వరిపంట

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

దేవరుప్పుల: మండలంలోని ధరావత్‌తండాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ధరావత్ రవి అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సహకారంతో మృతుని కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, శ్రీనివాస్, రవి, సోమసుందర్, సర్పంచ్ గేమానాయక్, సోమన్న, ఉమేష్, రాజు, నవీన్‌నాయక్, నర్సింహులు, యాకస్వామి, తిరుమలేష్ ఉన్నారు.

మంత్రిని కలిసిన సర్పంచ్..

పాలకుర్తి: నియోజకవర్గ కేంద్రంలో పీరీల కొట్టం, దర్గా, పోచమ్మగుడి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రి దయాకర్‌రావును సర్పంచ్ వీరమనేని యాకాంతరావు కలిసి విన్నవించారు. దీంతో మంత్రి స్పందించి ఆలయాల నిర్మాణాలకు రూ.15లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కర్నాకర్‌రెడ్డి, బండి కొండయ్య, దాసరి మధు, జీడి సమ్మన్న, మామిండ్ల సందీప్, రేపాల అశోక్, యాకయ్య పాల్గొన్నారు.

దేవాదాయ భూములను పరిరక్షించాలి

బచ్చన్నపేట: అన్యాక్రాంతమవుతున్న దేవాదాయ భూములను పరిరక్షించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్గొండ సహాయక కమిషనర్ కె. మహేందర్‌కుమార్‌శర్మ అన్నారు. బుధవారం కొడవటూర్‌లోని స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడారు. ఆలయాల పరిధిలోని భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని చెప్పారు. సేద్యం చేసుకోవడానికి అనువుగా ఉన్న భూములకు వేలం నిర్వహించి కాల పరిమితి ప్రకారం లీజుకు ఇవ్వాలని సూచించారు. అలాగే ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సుమతి, పలు ఆలయాల ఈఓలు చిందం వంశీ, లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంటకయ్య, ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలి

దేవరుప్పుల: ఉపాధి కూలీల సంక్షేమానికి పాటుపడే ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ జిల్లా చైర్మన్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ధరావ్‌తండాలో అనారోగ్యంతో మృతిచెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ధరావత్ రవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, వీరారెడ్డి దామోదర్‌రెడ్డి, సైదుల్‌రెడ్డి, ఎంపీటీసీ జాకీర్, ఎస్టీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సజ్జన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

17 ఎళ్లుగా చాలీచాలని వేతనంతో కూలీల సంక్షేమం కోసం పాటుపడే క్రమంలో అనారోగ్యంతో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ధరావత్ రవి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం రవి మృతదేహానికి ఆయనతో పాటు ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రం, ధరావత్ బిక్కు, ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్, ఫీల్డు అసిస్టెంట్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లక్ష్మీనారాయణనాయక్

ప్రజా సంక్షేమమే లక్ష్యం

చిల్పూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మహిళా మోర్చ మండల అధ్యక్షురాలు భోగం లావణ్య, ఉపాధ్యక్షుడు భోగం శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు వెన్నం మాధవరెడ్డిల ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో మాల కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం రూ. 10 లక్షలు మంజూరు చేశారు. సర్పంచ్ కొంగరి రవి, ఉప సర్పంచ్ బబ్బుల వంశి, భోగం రాజేందర్, వెంకటస్వామిఉన్నారు.

ఎమ్మెల్సీ కడియంను కలిసిన నాయకులు

మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన కడియం యువసేన నాయకులు జక్కుల రాజయ్య, ఎంపీటీసీ సాదం నర్సింహులు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని గ్రామ మహిళా సంఘాల సభ్యులు, నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మహిళా కమ్యూనిటీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని కోరారు. కాగా, ఎమ్మెల్సీ స్పందించిన తన సీడీఎఫ్ నిధుల నుంచి ఒక్కో భవనానికి రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

గార్లగడ్డతండా సీసీ రోడ్లకు రూ. 7 లక్షలు..

గార్లగడ్డతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంజీవనాయక్ ఆధ్వర్యంలో కడియంను కలిశారు. దీంతో సీడీఎఫ్ నిధుల నుంచి రూ. 7 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.



చిల్పూరు: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కడియం, కృష్ణారెడ్డి

నివాళి

రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వెల్ది గ్రామానికి చేరుకొని రామచంద్రారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

జనగామ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తున్నదని రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ పెట్టం, జిల్లా కోఆర్డినేటర్ రాపోలు పృథ్వీ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనతో ప్రజలు విసుగు చెందారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నదని చెప్పారు. అధికారంలోకి రాగానే రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. రూ.500లకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్, రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, అమరుల తల్లిదండ్రులకు రూ.25 వేల పింఛన్, కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు. కార్యక్రమంలో అల్లం ప్రదీప్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రాపోలు రామ్మూర్తి, పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోటే శ్రీనివాస్, బండారు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని దృష్టి పెట్టుకోని పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవనంలో ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు గుర్తింపు కార్డు ఇవ్వడానికి తంబ్ ఇంప్రెషన్ పెట్టాలలే ప్రభుత్వ ఆలోచన సరికాదని, పాత విధానం అమలు చేయాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి రూ.5వేల పింఛన్, ప్రసూతికి కల్యాణలక్ష్మి మాదిరిగా రూ.1,16,000 ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ప్రమాదంలో మరణించిన వారికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలని, డబుల్‌బెడ్రూం ఇవ్వాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజారెడ్డి, లింగాల రాములు, స్వామి, విజయ, సీతారాం, నాగరాజు, కనకయ్య, రేణుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సిద్ధేశ్వరుడి హుండీ ఆదాయం రూ.2.62లక్షలు

బచ్చన్నపేట: కొడవటూర్ స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,62,341 వచ్చినట్లు ఆలయ ఈఓ చిందం వంశీ తెలిపారు. బుధవారం హుండీ లెక్కింపు అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు నెలల తరువాత హుండీని లెక్కించామని చెప్పారు. కార్యక్రమంలో నల్గొండ పర్యవేక్షణాధికారి బి.సుమతి, పూజారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేలం నిర్వహించగా తలనీలాల హక్కులను పెగడ కోటయ్య రూ.2.11 లక్షలకు, కొబ్బరి ముక్కలు రూ.60 వేలకు మల్లం రాజమల్లయ్య దక్కించుకున్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఈఓ

బ్రిడ్జి నిర్మాణం ఇంకెన్నేళ్లు ..?




వాగు వద్ద మాట్లాడుతున్న ఇమ్మానియేల్‌రాజు

రఘునాథపల్లి: ఏళ్లు గడుస్తున్నాయి.. వర్షాకాలాలు వచ్చి పోతున్నాయి.. ఖాంజీపేట నుంచి శ్రీమన్నారయణపురం మీదుగా జనగామకు వెళ్లే మార్గంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరగడం లేదని, ఇదంతా స్థానిక ఎమ్మెల్యే రాజయ్య వైఫల్యం వల్లే అని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇమ్మానియేల్‌రాజు ఆరోపించారు. బుధవారం మండలంలోని ఖాంజీపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుతో ప్రజల ఇబ్బందులను పరిశీలించారు. రహదారిపై నుంచి మోకాళ్ల లోతుగా ప్రవహిస్తున్న వాగులో నుంచి ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని వెళ్లడాన్ని చూసి చలించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్‌రాజు మాట్లాడుతూ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించినా నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో రాజయ్య పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రచ్చ సోమనాథ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిరగౌడ్, నాయకులు అల్లిబిల్లి కృష్ణ, కొమురెల్లి, పృథ్వీ, కృష్ణ, విక్రమ్‌గౌడ్, శేఖర్, భిక్షపతి, అశోక్, సోమాజి, రవీందర్, పురుషోత్తం, శ్రీను, జానీ పాల్గొన్నారు.

కల్వర్టు దెబ్బతింటుందని దారి మళ్లింపు

జనగామ రూరల్: గానుగుపహాడ్ శివారు మన్యం బావివద్ద రోడ్డుకు అడ్డంగా రైతులు బుధవారం కందకం తీసి వాహనాల దారి మళ్లించారు. జనగామ నుంచి హుస్నాబాద్ వెళ్లే రోడ్డు గానుగుపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద కల్వర్టు కుంగి భారీ రంధ్రం ఏర్పాండింది. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సందర్శించి బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. వాహనాల రాకపోకల నిమిత్తం పక్కన తాత్కాలికంగా రోడ్డు వేశారు. భారీ వర్షాలకు కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. నర్మెటతో పాటు 35 గ్రామాలకు ఈ మార్గం నుంచి రాకపోకలు సాగాల్సి ఉండగా.. గానుగుపహాడ్ నుంచి దారి మళ్లించారు. గ్రామ శివారులో ఉన్న మరో కల్వర్టు దెబ్బతింటుదని, రోడ్డుపై భారీ గుంతలు పడుతున్నాయని గ్రామస్తులు వాహనాలు రాకుండా పొక్లెయిన్‌తో రోడ్డుకు అడ్డంగా కందకం తీశారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి



బచ్చన్నపేట: నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా పోటీపడుతున్నారని, ప్రతి మహిళా పొదుపును అలవాటు చేసుకోవాలని శ్రీనిధి మేనేజర్ నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రచనా మండల సమాఖ్య భవనంలో అన్ని గ్రామాల వీఓఏలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏపీఎం మురహరి, సీసీలు నర్సింహులు, విజయలక్ష్మి, తిరుమల, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏసిరెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/పాలకుర్తి: ఈనెల 28న జిల్లా కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహించనున్న వీరతెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఏసిరెడ్డి నర్సింహారెడ్డి 32వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, పాలకుర్తిలో వారు మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జనగామ ప్రాంతంలో ప్రముఖ పాత్ర పోషించిన నిరాడంబరుడు నర్సింహారెడ్డి అని అన్నారు. వర్ధంతిసభకు ముఖ్య అతిథిగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సభ పోస్టర్లను ఆవిష్కరించారు. మునిగెల రమేష్, ఎన్నకూస కుమార్, సాదం రమేష్, సారయ్య, అశోక్‌తోపాటు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కొనసాగుతున్న కాలనీ వాసుల దీక్ష

జనగామ: పట్టణంలోని సూర్యపేటరోడ్డు దుర్గానగర్ కాలనీ వాసుల నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. కాలనీ ప్రతినిధులు లక్ష్మానాయక్, కోటిరెడ్డి, అలూరి రమేష్, రమేష్, వంశీ, చిరంజీవి తదితరుల ఆధ్వర్యంలో జోరు వర్షంలో దీక్షలు కొనసాగించారు. కాలనీలో 150 కుటుంబాలు ఉంటే, ఏకక మార్గాన్ని(దారి) దేవాదాయ శాఖ అధికారులు మూసి వేశారన్నారు. దీంతో 11 రోజులుగా తీవ్ర ఇబ్బంది లు పడుతున్నామన్నారు. పిల్లలు బడికి వెళదామన్నా... 108 అంబులెన్స్ రావా లన్నా... ట్రాన్స్ పోర్టేషన్, మున్సిపల్ చెత్త బండ్లు ఇలా ఏ ఒక్కటి కాలనీలోకి రావడం లేదన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గట్టు రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో పీరీల సందడి

దేవరుప్పుల: కులమతాలకతీతంగా నిర్వహించుకునే మొహర్రం పండుగ పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. ఒక వైపు వర్షం కురుస్తున్న పీరీల 5వ రోజు ఉత్సవాల్లో పలు వీధుల్లో ఇంటింటా పీరీల ప్రదర్శన చేపట్టగా భక్తులు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

చెరువు వద్ద పూజలు

చిల్పూరు: సాగునీటి వసతులు లేని మండలంలోని లింగంపల్లి కయ్యు చెరువు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండడమే కాకుండా మత్తడి పోస్తోంది. కాగా, బుధవారం ఉదయం సర్పంచ్ ఏదునూరి రవీందర్ కయ్యు చెరువు కట్టపై ఉన్న మైసమ్మ వద్ద పూజలు నిర్వహించారు.

నియామకం

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చిలుపురం సాయికృష్ణ కాంగ్రెస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా నియామకం అయ్యారు. బుధవారం రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెట్టెం నవీన్, జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు పృథ్వీ నియామకపు ప్రతిని అందజేశారు.

పొన్నాలను కలిసిన డాక్టర్ రాజమౌళి

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమితులైన డాక్టర్ రాజమౌళి జనగామ నియోజక వర్గ కార్యాలయంలో బుధవారం పొన్నాల లక్ష్మయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. లింగాజీ, శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

కొడకండ్ల: బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను బుధవారం పాలకుర్తి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు హరగోపాల్‌గౌడ్, నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు గౌడ కులస్తుల వినతి

జఫర్‌గఢ్: గౌడ కులస్తులకు కేటాయించిన 10 ఎకరాల భూమిని గీతా పారిశ్రామిక సొసైటీ పేరుపై రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య ఆధ్వర్యంలో మండలానికి చెందిన ఉప్పుగల్లు గ్రామ గౌడ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని మినిష్టర్ క్వార్టర్స్‌లో కలసి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను కూడా కలసి వినతిపత్రం అందజేశారు. కాగా, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సానుకూలంగా స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌ద్వారా వివరించారన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం అమలు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని హం సత్ సోషల్ సర్వీస్ వ్యవస్థాపకుడు ఎండీ యాకూబ్ పాషా డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని శుభాంజలి మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకోగా అధ్యక్షురాలిగా బండ్లగూడెంకు చెందిన రమశ్రీ ఎన్నికయ్యారు. శుభాంజలి మండల సమాఖ్య 14వ వార్షిక మహాసభ నిర్వహించి సమాఖ్య లావాదేవీలను వివరించారు. అదేవిధంగా మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఉపాధ్యక్షురాలిగా కానుగంటి ఎల్లమ్మ (వనపర్తి), కార్యదర్శిగా బొజ్జం సునిత (నెల్లుట్ల), సహాయ కార్యదర్శిగా నూకల లక్ష్మి (నెల్లుట్ల), కోశాధికారిగా మమత (నాగారం)లను ఎన్నుకున్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలో అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం అన్నారు. బుధవారం అసెంబ్లీ కన్వీనర్ జిలుకర రవికుమార్ ఆధ్వర్యంలో పేదలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పాల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు.